# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా రెండు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్ ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రారంభిస్తారు.**

**2. తెలంగాణలోని గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**

**3. ఆంధ్రప్రదేశ్ లో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

**4. భారతరత్న, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.**

===========================

ఆంధ్రప్రదేశ్ అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రారంభిస్తారు. గన్నవరంలోని మేధా టవర్స్ తో పాటు రాజధాని అమరావతిలోని ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 1ఎస్, 1 క్యూ పేరిట ఏర్పాటు అవుతున్న రెండు వేర్వేరు క్వాంటం సాంకేతికత నిర్ధారణ, ధృవీకరణ సదుపాయాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ అధికారులు సహా, ఐఐటీ అధ్యాపకులు, క్వాంటం రంగ శాస్త్రవేత్తలు, అంకుర సంస్థల ప్రతినిధులు, నిపుణులు హాజరు కానున్నారు. అలాగే వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి దృశ్య మాధ్యమ విధానంలో దాదాపు లక్షన్నార మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి ప్రభుత్వ వసతి గృహాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించే కార్యక్రమాలను విస్తరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, వీధి దీపాలు, చెత్త సేకరణ వంటి అంశాల్లో సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

---------------------------

తెలంగాణలోని ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేతృత్వంలో గిరిజన, ఆదివాసీ శాసనసభ్యుల బృందం ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి సమస్యల పరిష్కారం కోసం నిన్న వినతిపత్రం అందజసింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.... గిరిజన ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పన కు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాం ల నిర్మాణం ద్వారా తాగు, సాగు నీటి అవసరాలను తీర్చవచ్చని అన్నారు. చెక్ డ్యాం లు, రహదారుల నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం నుంచి తిరుపతికి నడిచే ప్రత్యేక రైలును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ లో నిన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, తిరుపతి వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులకు ఈ రైలు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని రైల్వే స్టేషన్లను విడతల వారీగా అభివృద్ధి చేస్తున్నామని, ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఆయన నిన్న మాట్లాడుతూ, జిల్లాలోని నేరేడి జలాశయం పనులకు 60కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్మాణాన్ని ఏడాదిన్నరలోగా పూర్తి చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 22 సెకన్లు

---------------------------

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి నష్టం జరగదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో నిన్న ఆయన మాట్లాడుతూ, పునర్విభజన ప్రక్రియపై తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే ఈ ప్రక్రియ జరుగుతుందని ఇందుకు రెండేళ్ల సమయం పడుతుందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయొద్దని కిషన్‌రెడ్డి అన్నారు.

---------------------------

భారతరత్న, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి ఈరోజు, ఈ సందర్భంగా దేశానికి ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళు లర్పిస్తున్నారు. దేశంలో సామాజిక, ఆర్థిక సాధికారత కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన డాక్టర్ అంబేద్కర్ 1891వ సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన ప్రస్తుత మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని 'మౌ" అనే గ్రామంలో జన్మించారు. కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించారు. తదనంతరం

భారతదేశ స్వాతంత్ర్యం, పత్రికల ప్రచురణ, వెనుకబడిన వర్గాల, సామాజిక, రాజకీయ హక్కులు, భారతదేశ రాజ్యాంగ రూపకల్పన కోసం కృషి చేశారు. 1956 డిసెంబర్ 6వ తేదీన తన 65వ సంవత్సరంలో అంబేద్కర్ తుదిశ్వాస విడిచారు. ఆయన దేశానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం మరణానంతరం అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న"తో సత్కరించింది. ఆయన జయంతి సందర్భంగా పార్లమెంటులో ఒక సందర్భంలో అంబేద్కర్ చేసిన ప్రసంగాన్ని ఇప్పుడు విందాం...

వాయిస్ 22 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా బనగానపల్లె--అవుకు మధ్య ఉన్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-544డీ విస్తరణ పనులను వేగవంతం చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్ర రహదారుల శాఖ అధికారులతో కలిసి రహదారిని పరిశీలించి, అభివృద్ధి పనులు, భద్రతా చర్యలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రస్తుతం రెండు లైన్లుగా ఉన్న ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలకు మెరుగైన, సురక్షిత రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలతో భూభారతి చట్టం కీలక సంస్కరణగా నిలుస్తోందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఈ రోజుతో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్ సచివాలయంలో అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూభారతి పోర్టల్ 12 నెలల కాలంలో రెవిన్యూ సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి భూముల రీసర్వే పనులు కొనసాగిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

వేసవి నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కడపలో నిన్న 44.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పలు జిల్లాలలో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. రాయలసీమ, కోస్తా జిల్లాలో ఈ రోజు కూడా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. శ్రీకాకుళం జిల్లాలోని 4 మండలాల్లో, విజయనగరంలో 9, పార్వతీపురం మన్యంలో 15, పోలవరంలో 3, ఏలూరు జిల్లాలోని ఒక మండలంలో తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసినట్టు తెలిపింది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో అత్యధికంగా 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొంది.

====================